



వి. ఎస్. చెన్నూరి

రైలుబండి స్టేషన్‌లో ఆగింది.

పైపంచె దులుపుకుని బరువుగా బండి దిగాడు రాముడు. ప్లాట్‌ఫారం మీదికి చేరుకున్నాడు. ప్లాట్‌ఫారం రద్దీగానే ఉంది. సిగరెట్లూ, బటాణీలూ అమ్మే కుర్రాళ్ళు తెగ అరుస్తూ, పెట్టె పెట్టెకీ పరిగెడుతున్నారు.

రాముడు తలెత్తి స్టేషన్‌కేసి చూశాడు.

ఇంతక్రితం ఈ స్టేషన్ ఇంత విశాలంగా ఉండేది కాదు. ఇంతమంది ఎక్కేవాళ్ళు కారు. ఇంత రద్దీగా ఉండేది కాదు.

రెండడుగులు ముందుకి వేసి, గేటు వద్ద నిల్చున్న వ్యక్తి చేతిలో టిక్కెట్టు పెట్టి, స్టేషన్‌లోనించి బైట పడ్డాడు.

స్టేషన్ బైట నీళ్ళటాంకు అలాగే ఉంది. టాంకు కెదురుగా ఓ మర్రిచెట్టు ఉండేది. ఇప్పు డక్కడ ఏదో షెడ్డు వెలిసింది. రైల్వేవాళ్ళది కాబోలు!

[illegible] ముందుకి నడిచి రైల్వే కాంపౌండు దాటాడు. రోడ్డు కవతల ఏవో పాకలున్నాయి. ఇంత క్రితం అక్కడేం బాగుండేది కాదు. ఓ పాక ముందు ఏదో బోర్డు వేలాడదీశారు. లోపల రేడియో పాడుతూంది. హోటల్ కాబోలు!

ఊరు పూర్తిగా మారిపోయింది.

ఎంతకాలమైందితనీ ఊళ్ళో అడుగుపెట్టి! సరిగ్గా పదేళ్ళు! ఈ పదేళ్ళ కాలంలో ఎంత పెరిగిపోయిందీ ఊరు!

పదేళ్ళు! అప్పు డతనికి పాతికేళ్ళు కూడా ఉండేవి కావు. ఇప్పుడో! తలవెంట్రుకలు అక్కడక్కడ తెల్లబడుతున్నాయి కూడా.

పదేళ్ళు తనీ ప్రపంచానికి దూరంగా ఉండిపోయాడు.

ఒక్కసారిగా గతం అతని కళ్ళ ముందు గిర్రున తిరిగిపోయింది.

బాల్యంలోనే తల్లినీ, తండ్రినీ పోగొట్టుకున్న దౌర్భాగ్యుడు తాను. ఆ ఇంటా, ఈ ఇంటా చాకిరి చేసుకుని పొట్ట నింపుకునేవాడు.

తనకి అప్పుడు పదిహేనేళ్ళుంటాయి. ఆ ఊరికి పంతులుగా రొకాయన బదిలీ అయి వచ్చారు. చాలా మంచివారు. తన్ను చూచి "ఒరేయ్, రాముడూ, ఆ ఇంటా ఈ ఇంటా పాకులాడకపోతే నాతో ఉండిపోరాదూ? నాకూ ఎవరూ లేరు. నీ తిండీ, బట్టా నేను చూచుకుంటాను" అన్నారు.

"అంతకంటేనా. బాబూ!" అన్నాడు తను.

అంతే! ఆ ఊరు తాను విడిచిపెట్టేవరకూ ఆయనింట్లోనే ఉండిపోయాడు తను. తా నక్కడ చేరిన తరవాతే ఆయనగారికి పెళ్ళి అయింది. పార్వతమ్మగారు ఎంత మంచివారని! వారు బ్రాహ్మలైనా ఆమెకు భేదముండేదికాదు. "తమ్ముడూ!" అని పిలిచేది. సొంత తమ్ముడిలాగే చూచుకునేది.

మంచివాళ్ళకే కష్టాలు వస్తూయుంటారు! —

పెళ్లి అయి అయిదేళ్లు కూడా నిండలేదు. పంతులు గారు అకస్మాత్తుగా జబ్బుచేసి చెల్లుకున్నారు. పార్వతమ్మ గారు కన్నీరు మున్నీరుగా ఏడుస్తూంటే తనూ ఏడ్చేవాడు. అంత చిన్న వయస్సులోనే ఆమెకు వైధవ్యాన్ని అంట గట్టిన భగవంతుణ్ణి చెడతిట్టేవాడు.

పార్వతమ్మగారికి ఆ ఊళ్లో నా అన్న వాళ్లెవరూ లేరు. కాని పంతులుగారు ఆ ఊళ్లో పొలమూ పుట్రా సంపాయించడం మూలాన అక్కడే ఉండిపోవలసివచ్చింది.

వయస్సులో ఉన్న ఆడది ఒంటరిగా ఉండడం చూస్తే, ఈ పురుషపుంగవులకి ఎక్కడా లేని జాలి పుట్టుకు వస్తుంది. ఎవరికి వాడే ఆ అభాగ్యురాల్ని సొంతంచేసుకోవాలని చూస్తాడు. పంతులుగారు పోయిన తరవాత పార్వతమ్మ గారికి క్షణమొక యుగంగా గడపవలసి వచ్చింది.

"నేనిక ఇక్కడ క్షణం కూడా ఉండలేను, తమ్ముడూ. పొలమూ, పుట్రా బేరంపెట్టి పుట్టిల్లు చేరుకోవాలని ఉంది!" అనేది పార్వతమ్మ.

ఆమె ఆ మాట అంటూంటే తనకి ఏడుపు ముంచుకు వచ్చేది.

"తల్లిలా పెంచారు! తమ్ముళ్లా చూచుకున్నారు. నన్నిక్కడ ఉండిపొమ్మని మీరుమాత్రం వెళ్లిపోతారా?" అనేవాడు తాను దీనంగా ఆమెకేసి చూచి.

పార్వతమ్మగారికి కూడా కళ్లు చెమర్చేవి.

ప్రెసిడెంటు పెంటయ్యగారి పెద్దకొడుకు ప్రకాశం వట్టి జులాయివెధవ! పట్నంలో ఫోర్తుఫారం మూడేళ్లు చదివి, డిగ్రీ పుచ్చుకుని, ఊరు చేరుకున్న ప్రబుద్ధుడు! తెల్లగా బట్టలువేసుకుని ఊరంతా చెడ తిరిగేవాడు. అందమైన అమ్మాయిలు కనిపిస్తే చాలు తెగ పోజులిచ్చేవాడు. నయానో భయానో లొంగదీసుకోవడానికి ప్రయత్నించేవాడు. అవసరమైతే అఘాయిత్యాలు చెయ్యడానికి సైతం వెనుదీసేవాడు కాడు. ప్రెసిడెంటు పెంటయ్యగారి పెద్ద కొడుకు కావడం మూలాన అతగాడు ఆడింది ఆటగా చెల్లిపోయేది. ఆ ఊళ్లో పెంటయ్యగారు పెట్టింది చట్టం!

అలాంటి ప్రకాశం దృష్టి పార్వతమ్మగారి మీద కూడా పడింది. పార్వతమ్మ భయపడిపోయింది!

"ఆ పాపిష్టివాడు ఏదయినా అఘాయిత్యం చేస్తాడేమోనని భయంగా ఉంది, తమ్ముడూ!" అంది దీనంగా ఒకనాడు.

తన గుండెలు జల్లుమన్నా, పైకి కనిపించనీయకుండా సర్దుకున్నాడు. "ఈ రాముడి కంఠంలో ప్రాణం ఉండగా అలాంటిదేమీ జరగడానికి వీల్లేదు. మీరు విశ్రాంతగా ఉండచ్చు!" అన్నాడు తను గంభీరంగా. నిజానికి తనలో అంత పౌరుషమూ, తెగింపూ పెల్లుబికాయి. తన శరీరాన్ని ఎవరి ఉప్పు, కారంతో పెంచాడో వాళ్ల శ్రేయస్సుకోసం తృణప్రాయంగా త్యాగం చెయ్యడానికి తయారుగానే ఉన్నాడు.

కాని, ఏం ప్రయోజనం? తాను తన మాట నిలబెట్టుకోలేక పోయాడు. అప్రయత్నంగానే అతని కళ్లు చెమర్చాయి. పై పంచెతో కళ్లు తుడుచుకున్నాడు. ఆ సంఘటన జరిగి పదేళ్లు దాటుతున్నా, తలుచుకుంటే కళ్లకు కట్టినట్టు కనిపిస్తూంది.

రామమందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి. పెట్రొమాక్సు లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. రాజమండ్రి నుండి ఎవరో హరిదాసుని పిలిపించారట. దాసు కథ బ్రహ్మాండంగా చెబుతాడట. హార్మోనియం, మృదంగం, పక్కవాయిద్యాలు దాసుగారి ట్రూపులోనివేనట! వీధిలోని కుర్రవాళ్లు జట్లుజట్లుగా కబుర్లు చెప్పుకుంటూ, గట్టిగా కేకలు వేసుకుంటూ వెళుతున్నారు.

హరికథా కాలక్షేపమంటే తనకి మహా ఇష్టం! కాళ్ల గజ్జెలు ఘల్లుఘల్లుమనిపిస్తూ, చిటికెలు వాయిస్తూ, నృత్యంచేస్తూ హరిదాసు కథ చెబుతూంటే తన కెంతో ఉత్సాహంగా ఉంటుంది. ఎప్పుడో కాని తన కిలాంటి అవకాశం లభించదు. తనకీ వెళ్లాలని ఉంది.

కాని, ఇంట్లో పార్వతమ్మగారు ఒంటరిగా ఉంటారు. పెంటయ్య కొడుకు ప్రకాశం ఈమధ్య అచ్చుపోసిన ఆంబోతులా తెగ తిరుగుతున్నాడు. పార్వతమ్మగారిని ఒంటరిగా విడిచిపెట్టి వెళితే ఆ జులాయివెధవ ఏదయినా అఘాయిత్యం చేస్తే? —

వరండాలో కుక్కిమంచం వాల్చుకుని పడుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు.

లౌడ్‌స్పీకర్లో హరిదాసుగారి గొంతుక అతి శ్రావ్యంగా వినిపిస్తూంది!

**కాలం మారింది. మానవుడు అభ్యుదయాన్ని సాధిస్తూ నైతికంగా పతనమై పోతున్నాడు. ధనవంతుడు, బలవంతుడు, తెగించిన ప్రతివాడూ న్యాయాన్ని, ధర్మాన్ని పీకనొక్కి చంపేయ ప్రయత్నిస్తున్నాడు. కానీ ధర్మానికీ, న్యాయానికీ ఎప్పటికీ చావులేదు. అధర్మాన్ని శిక్షించ దలచినవాడే ధర్మాన్ని రక్షిస్తాడు... మానవత్వం కళ్లు తెరిచినపుడు మానవుడు దేవుడితో సమానం.**

మనసు మెరమెరలాడుతూంది! —

మంచంమీదనించి గబుక్కున లేచాడు.

పార్వతమ్మగారు లోపల పడుకుని ఉన్నారు. గదిలో దీపం వెలుగుతూంది. లోపల గడియ పెట్టబడి ఉందేమో!

అర్ధరాత్రి గడిచింది! —

ఈవేళప్పుడు ఆ జులాయివెధవ అంత అఘాయిత్యానికి పాల్పడతాడా? —

ఒక్కసారి అటు వెళ్లి వస్తే?—

దుప్పటీ సవరించుకుని తిన్నగా రామమందిరంకేసి బయలుదేరాడు. అడుగులు తడబడుతున్నాయి. కడుపులో దేవినట్టుంది.

ఛీ! తాను వట్టి పిరికి వెధవ! వట్టి అనుమాన పీనుగు! —

కాళ్లు ముందుకి నడిచాయి.

రామమందిరం వద్దకి చేరుకునేసరికి దేదీప్యమానంగా వెలుగుతున్న పెట్రొమాక్స్ లైట్లూ, ఆ లైట్ల వెలుగులో పూలమాల అలంకరించిన హరిదాసూ, అతని శ్రావ్యమైన కంఠస్వరమూ, పక్కవాద్యాలూ తన మనస్సుని ఆకట్టుకుని రెండు మూడు గంటలసేపు అలా నిలవేసి, మంత్రముగ్ధుణ్ణి చేసివేశాయి. నిల్చున్న చోటనే అలా కూలబడి, గోడకి జారగిలబడ్డాడు. తనకి తెలియకుండానే కళ్లు మూతలుపడి, ముందుకి తూలిపడబోయి, ఉలిక్కిపడి లేచి కళ్లు నలుపుకున్నాడు.

ఎందుకో గుండెల్లో గుభిల్లుమంది.

ఏమిటో అర్థంకాని కంగారు! —

ఎందుకో ఒక్క క్షణంకూడా అక్కడ కూచోలేక పోయాడు.

తక్షణం దుప్పటీ దులుపుకుని, అదిరే గుండెలతో, అర్థంకాని తొట్రుపాటుతో ఇంటివద్దకి చేరుకున్నాడు.

తెరవబడ్డ వీధి తలుపులు దర్శన మిచ్చేసరికి గుండెలు ఝల్లుమన్నాయి. భయంతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. అర్థంకాని ఆవేశంతో, అనుమానంతో లోపలికి చేరుకున్న తనకి, ప్రత్యక్షమయిన దృశ్యం, తన్ను దాదాపు శిలాప్రతిమలా మార్చివేసింది!

చిరిగి, పీలికలైన బట్టల్లోంచి బైటపడ్డ శరీరం, గాట్లతో, గాయాలతో రక్తసిక్తమై, మాంసపుముద్దలా కుప్పగా పడి వుంది. ఆమె ప్రాణ వాయువులు ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసిపోయినాయి.

తనకి పరిస్థితి అంతా అర్థమైపోయింది.

గుండెలు బ్రద్దలైనాయి.

ఆపుకుందామని ఎంత ప్రయత్నించినా ఆగని దుఃఖం పెల్లుబికింది. పెద్ద పెట్టున ఏడ్చేశాడు తను.

"ఒరేయ్, ప్రకాశం! — నువ్వు ఎంతపని చేశావురా! నీ గుండెలు చీలుస్తాను! — నీ రక్తం త్రాగుతాను!"

పిచ్చివాడికి మల్లే కేకలువేస్తూ, వెనక్కి తిరిగి వీధి గుమ్మంకేసి పరిగెత్తాడు. వీధి గుమ్మం వద్దకి చేరుకునేసరికి, వీధిలోని వినాయకులందరూ కట్టగట్టుకుని నిల్చుని ఉన్నారు.

"దిక్కులేని వాడివని చేరదీస్తే, తిన్నింటికే వాసాలు లెక్కబెడతావుట్రా? కృతఘ్నుడా!" అంటూ ముందుకి వచ్చి తన జట్టు పట్టుకున్నాడు ప్రెసిడెంటు పెంటయ్య.

"ఏం చేశావ్ ఆ పిల్లని?" అంటూ లోపలికి లాక్కొచ్చారు వినాయకులు.

పార్వతమ్మగారిని బలవంతంచేసి ఆమె మానాన్ని అపహరించి, చేసిన నేరం బైటపడుతుందన్న భయంతో ఆమె ప్రాణాలను సైతం తియ్యడానికి సాహసించాడన్న ఘోర నేరాన్ని తన నెత్తిన రుద్దారు. తనేమీ తెలియదని బ్రతిమాలుకున్నా వినలేదు. నిర్దయగా హింసించారు. పోలీసుల కప్పగించి తాను చెయ్యని నేరానికి ఫలితాన్ని అనుభవించమన్నారు.

పగతో, పరాభవంతో, పదేళ్లపాటు జైలుగోడల మధ్య యమయాతన లనుభవించాడు తాను.

ఈనాడు తనలోని ప్రతి అణువూ పగతో, పరాభవంతో దహించుకు పోతూంది.

ఆ ప్రకాశంగాడి గుండె రక్తంతోగాని తన తాపం చల్లారదు. జైలు జీవితం తనకేం కొత్తకాదు.

చెయ్యని నేరానికి పదేళ్లు నరకయాతన అనుభవించాడు తాను. చెయ్యబోయే నేరానికి మరో పదేళ్లు నిశ్చింతగా గడపగలడు. తృప్తిగా, హాయిగా ఉరికంబం ఎక్కడానికి సైతం సిద్ధమే!

న్యాయానికి కాలం కాదిది!

బలమున్న వాడిదే బ్రతుకు!

ప్రాణానికి ప్రాణం!

రక్తానికి రక్తం!

రాముడి కళ్ళు అగ్నిగోళాలయ్యాయి. కండలు పొంగాయి. కసిగా పళ్ళు పటపటలాడించాడు.

ఇక్కడికి సరిగ్గా పదిమైళ్ల దూరంలో ఉంది ఆ ఊరు. తన పార్వతమ్మని పొట్టబెట్టుకున్న ఊరు! ప్రెసిడెంటు వెంటయ్య ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఆ ఊరు!

నాలుగు మైళ్ళు ట్రంకు రోడ్డుమీద నడవాలి. ఇంకో ఆరు మైళ్లు చిట్టడివిలో బళ్లబాటంట వెళ్ళాలి!

అప్పుడే సూర్యు డస్తమిస్తున్నాడు. చీకట్లు కమ్ము కుంటున్నాయి. చల్లగాలి వీస్తూంది. వర్షం పడుతుం దేమో!

అయినా ఫరవాలేదు. తన కా దారి కొత్తేంకాదు. అర్ధరాత్రి అయినా నిర్భయంగా వెళ్లగలడు! కుంభ వృష్టి పడ్డా ఫరవాలేదు. తన ధ్యేయం నెరవేరాలి! తన పగ చల్లారాలి!

పార్వతమ్మకి అపచారంచేసిన దుర్మార్గుణ్ణి శిక్షించి తీరాలి! ప్రెసిడెంటు వెంటయ్య వంశాన్ని నిర్వీర్యం చెయ్యాలి! తన నిర్ణయానికి తిరుగు లేదు!

వెయ్యి ఏనుగుల బలాన్నీ, వెయ్యి సింహాల ధైర్యాన్నీ పుంజుకున్నాడు రాముడు.

అడుగులు వడివడిగా పడుతున్నాయి.

కొదమసింహంలా ఉరకలువేస్తూ నడుస్తున్నాడు.

ఊరు దాటి ట్రంకు రోడ్డు మీదికి చేరుకునేసరికి పూర్తిగా చీకటి పడిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు అలుముకున్నాయి. చలిగాలి వీస్తూంది.

రాముడికి చలి వేయడం లేదు!

రక్తం సలసల మరుగుతూంది!

ట్రంకురోడ్డు దాటి, చిట్టడవి మధ్యగా, కాలి బాటంట నడుస్తున్నాడు. చిమ్మచీకటి! చినుకులు కూడా పడసాగినాయి. ఎక్కడో ఉరుముతూంది. ఆకాశం మెరుస్తూంది. మెరుపుల వెలుతురులో ప్రకృతి నీలిముసుగు సవరించుకుంటూంది. కుమ్మరి పురుగులు జోల పాడుతున్నాయి. శ్మశానంలో నక్కలు విందు చేసుకుంటున్నాయి.

రాముడి కివేమీ కనిపించటం లేదు.

తన ధ్యేయం నెరవేరే క్షణం సమీపిస్తూంది. తన పగ చల్లారే అవకాశం ఆసన్నమవుతూంది!

అడుగులు వడివడిగానే పడుతున్నాయి!

డొంక మలుపు తిరిగి తాళ్ళ దగ్గరికి చేరుకునేసరికి ఏవో కేకలు, మూలుగులు వినిపించాయి.

రాముడు ఉలిక్కిపడ్డాడు. కేకలు వినిపిస్తున్న దిక్కుకి తిరిగాడు. ఎవరో స్త్రీ హృదయ విదారకంగా రోదిస్తూంది! తాళ్ల మధ్య ఒంటెద్దు బండి ఆగి ఉంది. బండికి చేరువలోనే ఏవో నీడలు కదులాడు తున్నాయి! ఏమిటది?

ఆలోచించే వ్యవధి లేదు!

రాముడు ఒక్క ఉరుకున అక్కడికి చేరుకున్నాడు.

ఎవడో కింద పడి నిస్సత్తువగా మూలుగుతున్నాడు.

కండలు తిరిగిన కర్కోటకు డొకడు ఓ స్త్రీని బలాత్కరిస్తున్నాడు. అతని ఇనుపచేతుల్లో ఆమె గిలగిల తన్నుకుంటూంది. పట్టు తప్పించుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తూంది. కర్కోటకుడికండలు ఆమెను పెనవేసుకుంటున్నాయి.

పదేళ్ల క్రితం జరిగిన ఆ సంఘటన అతని మస్తిష్కంలో తళుక్కున మెరిసింది!

ప్రకాశం చేతుల్లో పార్వతమ్మ గిలగిల తన్నుకుంటూంది!

రాముడి శరీరంలో వేడిరక్తం పరవళ్ళు తొక్కింది. కండలు పొంగాయి. కొదమసింగంలా కర్కోటకుడి మీదికి విరుచుకుపడ్డాడు. కర్కోటకుడు స్త్రీని విడిచి రాముడితో కలియబడ్డాడు. ఇద్దరికీ హోరాహోరీ పోరాటం జరిగింది. అప్పటికే బాగా అలిసిపోయా డేమో కర్కోటకుడు రాముడి కండబలానికి దాసోహ మనక తప్పలేదు. స్పృహ తప్పి నేల మీదికి ఒరిగాడు.

రాముడు అదును చూచి రివ్వున బండికేసి పరుగెత్తాడు. ఎద్దు మెడకి కట్టి ఉన్న పలుపుని ఊడ బెరికి తిన్నగా స్పృహ కోల్పోయిన కర్కోటకుడి వద్దకి చేరుకున్నాడు. పలుపుతో కాళ్ళూ, చేతులూ విరిచికట్టి చేతులు దులుపుకున్నాడు. క్రిందపడి మూలుగుతూన్న వ్యక్తివద్దకు చేరుకున్నాడు. దెబ్బలు బాగా తగిలాయేమో నిస్సత్తువగా పడి ఉన్నాడు. ఆమె అతని వద్ద కూలబడి ఏడుస్తూంది. చిటపట చినుకులు పెద్దవౌతున్నాయి.

రాముడు ఒక్కసారి తలఎత్తి దిక్కులు పరికించాడు.

రెండు ఫర్లాంగుల దూరంలో, బండ్లబాటపక్కనే పాడుపడ్డ శివాలయం కంటబడింది.

వర్షం ఉద్ధృతం కావచ్చు. తల దాచుకునేందుకు ఆ శివాలయం తప్ప మరో శరణ్యం లేదు.

"మీరేమీ కంగారుపడకండమ్మా! ఆయన కేమీ ప్రమాదం లేదు. కాస్త విశ్రాంతి ఇస్తే చాలు! వర్షం విజృంభిస్తూంది! మనం శివాలయంలోకి చేరుకోవాలి!" అంటూ రాముడు అతని మీదికి వంగి, అతణ్ణి భుజం మీద వేసుకున్నాడు. "పదండమ్మా! పదండి" అంటూ అడుగులు ముందుకి వేశాడు.


ఆమె అతనికేసి కృతజ్ఞతా పూర్వకంగా చూచింది.

"నీ మేలు జన్మజన్మాలకీ మరిచిపోలేం, బాబూ! ఆత్మ బంధువులా ఆదుకున్నావు. నువ్వే గనక సమ యానికి రానిపక్షంలో ఆ దుర్మార్గుడు ఏం అఘా యిత్యం చేసేవాడో! మాకు ప్రాణభిక్ష పెట్టి రక్షిం చావు!"

రాముడు ఆమె అభినందనలను అందుకునే స్థితిలో లేడు. అతని మనసు ఎక్కడో ఉంది. అతని మస్తి ష్కం ఆలోచిస్తూంది.

తాను జైలులో గడిపిన ఈ పదేళ్ల వ్యవధిలోనూ కాలం ఎంతో మారిపోయి ఉంటుందనీ, మానవుడు ఎంతో అభ్యుదయాన్ని సాధించి ఉంటాడనీ పొరబడ్డాడు. కాలం మారిన మాట వాస్తవమే. మానవుడు అభ్యుద యాన్ని సాధించడానికి బదులు అధఃపాతాళానికి దిగజారిపోయాడు. ఆ నాడు ధనవంతుడే బలవంతుడు! బలవంతుడు ఎన్ని అక్రమాలు చేసినా చెల్లిపోయేది. తన బలంతో ఎందరి నోళ్ళయినా మూయ గలిగేవాడు. ఈనాడు ఒక్క ధనవంతుడే కాదు, తెగించిన ప్రతి మాన వుడూ బలవంతుడే. వాడి అఘాయిత్యాలకి అడ్డులేదు. కాకపోతే బండితోలుకుని బ్రతికేవాడు ఇంత దుర్మా ర్గానికి పూనుకుంటాడా?

ఎక్కడో ఫెళఫెళా ఉరిమింది. కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరిసింది. ఈదురుగాలి రివ్వుమని వీస్తూంది. వర్షం క్షణక్షణానికీ విజృంభిస్తూంది. దారి కనిపించ ●



వికసన విలసనం

ఫోటో—వై. ఎల్. ఎన్. రావు (హైదరాబాదు-32)



లేదు. చిత్తడి నేలలో అడుగులు తడబడుతున్నాయి. అతగాడి శరీరంలోని వేడిమి చప్పగా చల్లారిపోయింది. చలికి ప్రేవులు వణుకుతున్నాయి. భుజంమీది అభాగ్యుడు క్షణక్షణానికీ బరువెక్కుతున్నాడు. అడుగు ముందుకి పడడం లేదు. అతి కష్టంతో ముందుకి నడుస్తున్నాడు. భుజాలు పీకుతున్నాయి. కాళ్ళు లాగుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. ఓపిక నశిస్తోంది. పట్టుదలతో ఊపిరి బిగబట్టి నడుస్తున్నాడు.

పాడుబడ్డ దేవాలయంలోకి చేరుకునేసరికి రాముడి ఆనజీవాలు కుంగిపోయినాయి. ఆ స్త్రీ సాయంతో భుజంమీది వ్యక్తిని అరుగుమీదికి చేర్చాడు. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. పైపంచెతో అతని ముఖం తుడిచాడు.

స్పృహ తప్పిన వ్యక్తి మెల్లిగా కదిలాడు. సన్నగా మూలిగి కళ్ళు తెరిచాడు.

రాముడి ముఖం సంతోషంతో విప్పారింది.

పార్వతమ్మ మాన ప్రాణాలని దోచుకున్న ప్రకాశం మీద పగ తీర్చుకోవాలన్న ధ్యేయంతో బయలుదేరిన తాను, పార్వతమ్మలాంటి మరో అబల మాన ప్రాణాలని కాపాడగలిగాడు. స్పృహ కోల్పోయిన మరో అభాగ్యుణ్ణి కూడా రక్షించగలిగాడు.

ఇప్పుడతని శరీరం పగతో పొగలు, సెగలు కక్కడం లేదు. ఏదో తృప్తితో, సంతోషంతో ఉరకలువేస్తోంది. హృదయం అనిర్వచనీయమైన ఆనందంతో ఉప్పొంగిపోతూంది.

అరుగుమీద పడుకున్న వ్యక్తి మెల్లిగా లేచి కూర్చున్నాడు. అతని భార్య అతని వద్ద కూచుని పమిటచెంగుతో విసురుతూ ఏదో చెబుతూంది. అతడు వింటున్నాడు.

రాముడు అదేమీ వినడం లేదు. చొక్కా విప్పి, పిండి, పిట్టగోడమీద ఆరవేసి, పైపంచెతో ఒళ్ళు తుడుచుకున్నాడు. బొడ్లోంచి అగ్గిపెట్టె, చుట్టపీకా బైటకి తీశాడు. అగ్గిపుల్లతో చుట్టపీక అంటించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. పుల్ల వెలగడంలేదు. చుట్టపీక అంటుకోవడం లేదు. అయినా అతడు తన ప్రయత్నం మానడంలేదు.

పుల్ల వెలిగింది. చుట్టపీక అంటుకుంది. అగ్గిపుల్ల వెలుగులో అరుగుమీద వ్యక్తి ముఖం స్పష్టంగా అగుపించింది. రాముడు ఉలిక్కిపడ్డాడు. మరోపుల్ల వెలిగించాడు. ఆ పుల్ల వెలుగులో అతని ముఖంకేసే చూస్తూ ఉండిపోయాడు. ఆ వ్యక్తి సైతం అతనికేసే కళ్ళప్పగించి చూస్తున్నాడు.

రాముడి కండలు ఉబికాయి. నరాలు బిరుసెక్కాయి. కళ్ళు చింతనిప్పులయ్యాయి. "ప్రకాశం!" అంటూ ఓ పొలికేక పెట్టాడు. ఆ కేకతో దిక్కులు పిక్కటిల్లాయి.

"ఎవరూ?" ఆ వ్యక్తి గజగజలాడిపోతూ లేచి నిల్చున్నాడు.

"నేనురా! నువ్వు చేసిన నేరాన్ని నా నెత్తిన వేసుకుని పదేళ్ళపాటు జైలుశిక్ష అనుభవించిన రాముణ్ణి! నా పగ తీర్చుకోవడానికి బయలుదేరిన నీ కాల యముణ్ణిరా!" అంటూ కొదమసింగంలా ఒక్క దూకు దూకి ఎడంచేత్తో అతని చొక్కా పుచ్చుకున్నాడు. కుడిచేత్తో మొలలోని కైజారు పైకి లాగాడు.

ప్రళయకాల రుద్రుడిలాంటి అతని భీకర స్వరూపాన్ని చూచి ప్రకాశం బెంబేలెత్తిపోయాడు. ఆకులాగ గజగజ వణికిపోతూ, "రాముడూ! నన్ను చంపుతావా?" అంటూ దీనంగా కిందికి జారి రాముడి కాళ్ళు రెండూ చేర్చి పట్టుకున్నాడు.

ఆకాశం ఫెళఫెళా ఉరిమింది!

ఎక్కడో పడింది పిడుగు!

కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరిసింది మెరుపు!

ఆ మెరుపు వెలుగులో, ప్రకాశం భార్య అమాయకపు వదనంలో పార్వతమ్మ బెదిరిన కళ్ళు స్పష్టంగా కనిపించాయి రాముడికి.

అతని చేతిలోని కైజారు జారి కింద పడింది.

"ఛీ! పిరికిపందా! వెళ్ళిపో. తక్షణం ఇక్కణ్ణుంచి పారిపో!" అంటూ మెరుపులా బైటకి గెంటాడు ప్రకాశాన్ని.

ప్రాణాలు పిడికిట్లో పట్టుకుని, పిరికిపందలా పారిపోతున్న ప్రకాశాన్నీ, అతణ్ణే వెంబడిస్తున్న అతని భార్యనీ చూస్తూ తృప్తిగా నవ్వుకున్నాడు రాముడు.

రక్షించడంలోని గొప్పతనాన్ని చవిచూచిన రాముడు, శిక్షించలేకపోయాడు.

ఆనాడు పార్వతమ్మను ప్రకాశం బారినుండి రక్షించలేకపోయానన్న అసంతృప్తిని, ఈనాడు ఆ ప్రకాశం భార్యను మరో కిరాతకుడి బారినుండి రక్షించానన్న తృప్తి జయించింది!

రాముడి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ★